# సవారి

నాకు మా ఊరంటే చానా ఇష్టము...

మా ఊరి మనుషులంటే ఇంకా ఇష్టము...

మా తోటంటే చెప్పలేనంత ఇష్టము... మా తోటలో ఒంటిగా ఉండే మా ఇల్లూ ఆ ఇంట్లో – చింపిరి జుట్టు పెట్టుకొని దెయ్యమా కట్ల ఉండే మాయవ్వ, మాయవ్వ చేసే వంటలూ, ఆయమ్మ కోపమూ, తిట్లూ, పొగడ్తలూ, చెప్పదానికే అలివికానంత ఇష్టము.

మా నాయినది గవర్నమెంటు ఉద్యోగం, దాని నించీ నేను అనంతపురంలో సదువుకుంటా ఉండాను. అసలు ఆయనకి ఆ ఉద్యోగం యాల వచ్చిందోననీ ఎప్పుడూ తిట్టుకుంటా ఉండేదే నేను. అదే రాకుండా ఉండి ఉంటే నేను హాయిగా ఎప్పుడూ తోటల్లో, చేన్లల్లో గెంతులేస్తా, వంకల్లో, వాగుల్లో, బాయిల్లో ఈదులాడుతా, పచ్చిక మైదానాల్లో పరుగులు తీస్తా ఉందును కదా! అందుకే, ఇట్లా సెలవలపుడు ఈడ గడిపే దాన్నించేనేమో నాకి మా ఊరిమీద మమకారం మరింత ఎక్కువయ్యిందేమో మరి.

నేను వచ్చినానని మాయవ్వ మాపుసారి కాడ గుడ్లకోడిని కోసింది. తనే తుప్పటి ఊసింది. కాల్చింది. మెత్తటి తునకల్నీ, ఎముకల్నీ, వేరు చేసింది. దాంట్లోకి మసాలా సిద్ధం జేసుకొని రోట్లో నూరతా ఉండాది.

సరింగా అప్పుడు మేపులకి పోయిండే మా యావుల్ని తోలుకొని వచ్చినాడు దుబ్బోడు. పశువుల కోసరం వేరే కొట్టం ఏమీలేదు. మా ఇంటి ముందర ఉండే వేప, చింత చెట్ల బుడాలకే వాటినన్నింటినీ కట్టేసినాడు. మసాల నూరేది పూర్తిచేసి మాయవ్వ ముద్దకి ఎసరు పెట్టింది. పాలు పిండేదానికోసరం పెద్ద ఇత్తడి చెంబు తీసుకొని వచ్చింది. బట్టావుపాలు పిండింది. ఈ పాలు కొండానబోయి పాలకుండలోకి పోసి, పొయ్యి మీద పెట్టరా అంటూ పాలచెంబుని నా చేతికి ఇచ్చింది.

అంతసేపూ పాలకోసం ఇగ్గులాడతా ఉన్న దూడ పలుపుతాడు ఇడుస్తానే తల్లి పొదుగు కాడికి జేరి మూతితో గుద్ది గుద్ది తాగేకి మొదులు పెట్టె.

"ఎవుడీడు? పాలు కండానబోయి పాలకుండలో పోసిరా పోరా, అంటే దూడకల్లే జూస్తా ఉండాడు." అంటానని ముద్దుగా కసిరె మాయవ్వ.

"అది జూడవ్వా! ఎంత ఆత్రంగా పాలు తాగుతాందో" అని అంటి. నా మాటకి జవాబుగా నగుతా దూడకల్లా ఒకసారి జూసి నా సేతుల్లో నించీ పాల చెంబు తీసుకొని ఇంట్లోకి పాయ మాయవ్వ.

సీకటి కమ్ముకుంటా ఉండాది. ఇంట్లో వండుతాండే కోడికూర వాసన ముక్కుకి తగులుతాంటే నా నోరు ఊరుతా ఉండాది. మా ఇంటి పక్కన ఉండే దోవలో - దూరంగా ఉండే తోటల్లో కలుపులకి పోయిండే ఆడోళ్లూ, సేద్యం పనులకి పోయిండే మొగోళ్లూ కంపాకట్టే మోపుల్ని నెత్తిమీద పెట్టుకొని ఊరు మారయి పోతా ఉండారు - బిరి బిరీ.

"ఓ పెద్దమ్మా! సియ్యాల కూర వండుతాన్నెట్లుందే వాసనొత్తాంది. వత్తునా తినేకి" అంటూ నగసారానికి మాట్లాడతా ఉండాడు ఒకాయప్ప - నిలబడి.

"ఎవురూ - మాట్లాడేది అంజనప్పేనా! ఏమప్పయ్యా! రామడి! నీకి పెట్టకే లేదేం కొడుకా!" అనే మాయవ్వ.

"ఆ పెద్దమ్మా చూడంద్రా! ఇంత మబ్బులో గూడా గొంతుని బట్టి ఎంత బాగా గుర్తు పడతాందో" అని అనుకుంటా ఇంకెవరో పోతా ఉండారు.

"అడ, మంచం మీద కూకోని ఉండేది ఎవురు పెద్దమ్మా!" అనె ఇంతకుముందు మాట్లాడినాయప్ప.

"నా మనుముడప్పో! ఆయప్ప వచ్చింటేనే ఈ పొద్దు కోడిని కోసిందేది" అనె మాయవ్వ. నా సదువు గురించి అడిగె అయప్ప. చెప్తిని. అన్నిటికీ సమాధానంగా పొయ్యొస్తానని చెప్పి ఎల్లిపాయ ఆయప్ప.

ఆవుల ముందర వరిగడ్డి ఏస్తా ఉండాడు దుబ్బోడు.

ఇంగ రెండు దినాల్లో పున్నమి - అందుకే తూరుపు దిక్కున ఇప్పుడు పుడతావుండాడు చెందురూడు ఎర్రగా.

అందమూ, ఆనందమూ కలగలిసి పోయేది యాడ జూడల్లంటే, ఆడే జూడల్ల.

అల్లంత దూరంలో ఉండేటివి మా పెద్ద తాత ఇండ్లు... ఆ ఇండ్ల మధ్య మేకల్నీ, పశువుల్నీ, కేకలు వేస్తూ కట్టేసున్న చప్పుళ్లూ.

మా ఇంటి పక్కన ఉన్న తుమ్మ చెట్లనుంచి వస్తున్న కీచురాళ్ల శబ్దాలు ఎంత బాగుంటాదో...

కోడికూర, అన్నం తయారయిందే తడవుగా కంచుతట్టలో పెట్టుకోని వచ్చింది మాయవ్వ. నేను మంచం మీదే కూకోని ఆవురావురు మంటా తినేకి మొదలు పెట్టినా. ఆ అడవి వాతావరణానికి ఆ కూర మరింత రుచిగా ఉంది. ఏ దేవతల విందు కోసరమో చేసినట్టుంది. గొంతుదాకా తిన్నాను. అప్పటికే చందమామ మా ఇంటి ముందర ఉన్న చింతచెట్టు కొమ్మల్లో చిక్కుకోని ఉండాడు.

చింతమానుల నడుమ ఆ పొద్దే కోసిన కంది, కల్లంలో వేసి ఉండాది. అక్కడ మంచాలు వేసుకొని పండుకున్నాం.

అదసలే సలికాలం. ఎముకలు కొరికేదట్ల ఉంది సలి. నేనైతే తలకి బిర్రుగా వల్లితో పేటా చుట్టుకోని నల్లని గొర్లకంబిళి కప్పుకోని ఉండాను. ఎన్నెల పాలారబోసినట్లు ఉండాది. మా ముత్తాత వారాదప్ప గురించి చెపుతాంది మాయవ్వ. మా ముత్తాత మంచి వైద్దిగాడంట. ఆయప్ప గుర్రం మీద ఎక్కి సవారి జేస్తూ సుట్టు పక్కల పల్లెల్లోకి పోయి వైద్దికం జేసేవాడంట. అప్పట్లో కళ్యాణదుర్గం తాలూక కచేరిలో పనిజేసే ఒక సర్వేరుకి రంకు జాడ్యం వచ్చిందంట. ఆయప్ప యాడేడ వైద్దికం జేయించుకున్నా మేలు కాలేదంట. అప్పుడెవరో మా ముత్తాత పేరు చెబితే, ఆయప్ప ఎతుక్కుంటూ మా ఊరికి వచ్చినాడంట. మూడు నెలలు తిరక్కనే ఆ సర్వేరు రోగాన్ని బాగ జేసినాడంట మా ముత్తాత. అప్పుడు ఆ సర్వేయరు ఎక్కడలేని సంతోషంతో "వారాదప్పా! ఎన్ని ఎకరాల భూమి కావాలో చెప్పప్పా! పట్టా చేసి ఇస్తాను" అన్నాడంట. అది ఎర్రికాలం గదా! ఇప్పుడయితే ఆ కనుజూపు మేరలో ఉండే భూమినంతా కావాల్లని అడుగుదురు. కాని, మా ముత్తాత అట్ల అడగలే "– కేవలం నలభై ఎకరాలు సాలు సారూ!" అని అన్నేడంట. సరేనని – నలభై ఎకరాలు పట్టా భూమి ఇచ్చి, ఇంకా నలభై ఎకరాలు శివాయిజమా భూమిని నువ్వే జేసుకోప్పా! అని అన్నేడంట. అప్పటి నుంచీ మా ముత్తాత ఆరుగాండ్ల ఎద్దులు పెట్టుకొని సేద్యం జేయిస్తా ఉన్నేడంట.

అదంతా ఇన్నేక నాకి నిజమైన జానపద హీరో మాదిరి అనిపించె మా ముత్తాత. ఆయప్ప భూమి సంపాదించుకొనే దాని కంటేకూడా – గుర్రం ఎక్కి వైద్దికం చెయ్యడమే గొప్పగా అనిపించె నాకి. నాకే గీన గుర్రం ఉండి ఉంటేనా! దినాము అనంతపురానికి ఈడకీ సవారి జెయ్యనా!

ఇంతలో సెట్టు కింద గునగునా మాట్లాడుకుంటూ ఎవురో వస్తున్నట్లు అనిపించి తల నిక్కబెట్టి జూస్తి. మూడు ఆకారాలు మేముండే చోటికి కదిలి వస్తా ఉండాయి. అవి దగ్గర కొస్తున్నట్లే, నా పేరు పెట్టి పిలిచింది ఒక ఆకారం. ఆ గొంతుని బట్టి కనుక్కొంటి అది మా పెద్దతాత మనుమడు. ఆయప్ప పేరు ఆనందు. నాకంటే ఒక సమ్మత్సరం పెద్దోడు. తక్కిన ఇద్దరూ మా చిన్నాయన కొడుకులు జీవన్న, రాజన్నలు, వాళ్లు నాకంటే చిన్న.

"ఏమర్రా! ఇట్ల వస్తిరి ఈయాలకాడ? సంగటి తిన్నేరా"! అని అడిగె మాయవ్వ. ఆనందన్న అవ్వకి సమాధానం చెప్తా' ఉంటే, రాజన్న జీవన్నలు నా చెవిలో గుసగుసలాడుతూ ఉండారు. ఏమనీ? 'వంకలో కొరిసేవాళ్ల గాడిదలున్నాయి పోదాం రాన్నా' అని.

"అవుంటే మనకేమిరా!" అనంటి.

"సవారి జేద్దామన్నా!" అనె జీవన్న

సవారి అనే మాట వింటానే ఎక్కడలేని, ఉల్లాసం వచ్చేసింది నాకి. అంతదాకా కప్పుకొని ఉండే కంబళిని పక్కని తీసి పారేసి నిటారుగా నిలబడితి. సలీ, గిలీ యాటికి పరారయిపాయెనో. ఆనందన్న మాయవ్వతో ఏం జెప్పినాడో గాని 'ఆడుకోని బిరీన రావల్లప్పో!" అనింది. అంటే – గాడిదల గురించి తెలీదన్నమాట!

ఉరుకులు పరుగులు తీసుకుంటా ఎల్లబారుతా ఉంటే, మాతో పాటి దుబ్బోడూ వచ్చినాడు.

ఎన్నెల్లో చెట్ల నడుమ మాకేకలూ, కేరింతలూ...

చింతతోపులో కట్టేసి ఉన్నాయి ఐదు గాడిదలు.

ఈ పొద్దు పైటాల కాడ గంగవరం కొరిచేవాళ్ళు బుట్టలు అల్లేదాని కోసరం, ఈత బర్రలు కోసుకొని పోయేదానికి వచ్చినారంట. సందకాడ మా ఊర్లో వాళ్లను బంధువుల చూసేకి పోయినారంట. ఆనందన్న జెప్పినాడు.

ఇంక జూడీ, చెట్టకి కట్టేసి ఉండే గాడిదల కట్లు ఇప్పుదీసి ఆ పక్కనేఉన్న వంక లేకి తలా ఒక గాడిదతో సవారికి తయారయినాము. అప్పటికి నాకి సైకిలైతే తొక్కేదానికి వస్తాదికానీ, ఇట్లా సవారి చేసేకి రాదు మడి. ఆనందన్న గాడిదని పట్టుకొని, నన్ని దాని మింద కూకోమని, దాని మెడ మీద జూలును పట్టుకొమ్మనె. నెమ్మదిగా కూకొంటిని. గాడిద పెయ్యి ఎచ్చగా నా శరీరానికి తాకుతోంది. మొదట మెల్లిగా సాగింది సవారి. మెల్లిమెల్లిగా అలవాటయ్యే కొద్దీ వేగం పెంచుతా ఉండాను. మిగతా వాళ్లందరికీ అప్పటికే బాగా అలవాటు ఉన్నెట్లుంది, జోరుగా గాడిదల్ని దవుడు తీయిస్తా ఉండారు, వంకలోని ఇసకలో. దూరంగా బోసి పోయిన చేనులు వెన్నెలని తాగి అందాలను ఆరబెట్టుకుంటూ వుండాయి. చెట్లన్నీ వెన్నెల స్నానాలు చేస్తా మా ఉల్లాసానికి నిబ్బరంగా తలలు ఊపుతా ఉండాయి. ఎన్నిసార్లు కిందికి పడినానో గాడిద మింద నించీ. మోకాళ్లూ, మోచేతులూ దోక్కపోయినాయి... బగబగ మండుతా ఉండాయి. అయినా ఏడుపూ రాలేదు, బాధా కలగలేదు. మా ఆనందం ఉప్పొంగి పోతాంటే మాకు తెలియకనే కేకలు గొంతులో నుంచీ దూసుకొస్తుండాయి. రాజ్యాన్ని జయించిన రారాజులు గుర్రాల మీద పరుగు తీస్తా ఉన్నెట్లుండాది.

నేను ఆ సవారిలో అలసి పోయేదప్పటి కల్లా ఏగుసుక్క పుట్టింది తూర్పున.

❀ ❀ ❀ ❀

పొద్దున్నే జూసుకుంటే ఇంకేముందీ, మోచేతులూ, మోకాళ్లూ బాగా దొర్లుబోయినాయి. నెత్తురు నల్లబడుతా, గడ్డకడుతా ఉండాది.

"ఎంత పని జేసుకుండావురా!" అనే మాట విని తలెత్తి జూస్తే మాయవ్వ! దిగులు మొగంతో నా గాయాలని ప్రేమగా ముట్టుకొని, తిట్టిన తిట్టు తిట్టకుండా గంటసేపు తిట్టి నల్ల అలము ఆకు పసరు గాయాల మింద పిండి కట్టు కట్టింది. దుబ్బోడిని పట్టుకొని జాడించింది అవ్వ. వాడు అసలు సంగతి కక్కేసినాడు. "ముత్తాత గుర్రం మీద స్వారి జేస్తే ముని మనుమడు గాడిద మింద సవారి జేసినాడంట. సిగ్గన్నా లేకపోతే సరి. ఛీ! పదో తరగతి సదివే గాడిదయినావే ఎట్లజేస్తివిరా గాడిద మింద సవారి" అంటూ తన తిట్లకి తిరగవాత పెట్టింది. అసలు మాయవ్వ గాడిదంటే ఏమనుకొనిందో - ఆయమ్మ దినాము మొక్కే ఆ ఏసు ప్రభువు గాడిద మింద కాదా సవారి జేసిందేది. ఆ మాటే అంటిని.

"నోరన్నా మూసుకోరా గాడిద నాయాలా! దేవున్ని అట్లంటే కండ్లు పోతాయి." అంది మాయవ్వ.

సందకాద అయింది...

మళ్లీ ఎట్లన్నాగానీ ఆ రాత్రికీ గాడిద మీద సవారి జెయ్యాలని ఉరుట్లాగుతూ ఉండాను. దాని కోసరం దుబ్బోన్ని, ఆనందన్న కోసరం పంపినా - వాడు తిరిగొచ్చి సావు మాట సల్లగ జెప్పినాడు - కొరిసేవాళ్లు పైటాలకాడే గాడిదల్ని తోలుకొని గంగవరం పోయినారని. ఏంజేసేది? నా ఉబలాటమంతా నీరుగారిపోయింది. మరుసటి దినమే అనంతపురానికి వచ్చేస్తి.

❁ ❁ ❁ ❁

అదిగో ఇదిగో అనే తలికే ముప్పయ్యేండ్లు గడిచిపోయె. నాకు యాపారంలో కలిసొచ్చి అనంతపురంలోనే పెండ్లాం పిల్లలతో కాపురం పెట్టినా. ఇప్పుడు నా కొడుకులిద్దరూ తలా ఒక మోపెడ్‌లో కాలేజీలకు పోతా ఉండారు. ఆస్తులు ఉండాయి, అప్పులూ ఉండాయి. అయితే ఇప్పుడు అవ్వలేదు, తోట లేదు, ఎన్నెల లేదు, వంకలేదు, గాడిదలు లేవు. ఆ సంతోషాలూ, ఉల్లాసాలూ అసల్లేవు...

• గ్రంథాలయ సర్వస్వం - మే, **2005** •